క్లుప్తంగా

ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు


పండ్లు పంపిణీ చేస్తున్న వెంకటేశ్ గౌడ్

బొమ్మలరామారం : మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్వీ వెంకటేష్ గౌడ్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ డాక్టర్ క్రాంతి, నాయకులు ఇండ్ల అంజయ్య, వడ్లకొండ భిక్షపతి, లక్ష్మయ్య, నవీన్ రెడ్డి, అశోక్, మల్లేష్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


లియో క్లబ్ సభ్యులతో లయన్స్ ప్రతినిధులు

రామన్నపేట : రామన్నపేట లయన్స్‌క్లబ్‌కు అనుబంధంగా గురువారం 40మంది విద్యార్థులతో లియో క్లబ్‌ను ఏర్పాటు చేశారు. క్లబ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ పనకంటి భాస్కర్‌రావు, జిల్లా కోఆర్డినేటర్ బి.వెంకటేశం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావుల తిరుమలేష్, ఉపాధ్యక్షుడిగా పగుడాల వివకవర్ధన్, ప్రధానకార్యదర్శిగా నెల్లుట్ల యశ్వంత్, కోశాధికారిగా రాపోలు అభినవ్‌ల ను ఎన్నుకున్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 23న (శనివారం) మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలన్నారు.

వన నర్సరీ పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నిరంజన్

ఆత్మకూరు(ఎం): మండలంలోని తుక్కాపురంలో వన నర్సరీని గురువారం ఎంపీడీఓ నిరంజన్ పరిశీలించారు. నర్సరీ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హనిషాభేగం, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్, అంగన్‌వాడి టీచర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సారగండ్ల నరేష్

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉగ్గె భిక్షపతి కుటుంబాన్ని గురువారం స్థానిక నాయకులు పరామర్శించారు. యువజన కాంగ్రెస్ నాయకుడు సారగండ్ల నరేష్ సహకారంతో రూ. 10వేల ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, సర్పంచ్ జన్నాయికోడె నగేష్ అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, సీపీఎం కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, నాయకులు ఎద్దు వెంకటేశ్వర్లు, రంగ శ్రీను,స్వామి, లోడి మహేష్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ భూపతి, అధికారులు

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డులో రూ.5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను గురువారం కౌన్సిలర్ సంగు భూపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, నవీన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ఆలేరురూరల్ : విద్యుధాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని కొలనుపాక గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రుద్దురు కొమరయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో తన ఆవు మేత మేస్తుండగా కోతులు తరమడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగిలింది. దీంతో విద్యుధాఘాతానికి గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ దాదాపు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

నత్తనడకన నిర్మాణ పనులు

- బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి రూ.1.56కోట్లు మంజూరు
- పనులు ప్రారంభించి తొమ్మిది నెలలు గడిచినా పిల్లర్ల దశలోనే..
- ప్రస్తుతం మండల సమాఖ్య భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీ


పిల్లర్ల దశలో ఉన్న పీహెచ్‌సీ భవనం


మండల సమాఖ్య భవనంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బీబీనగర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండల కేంద్రంలోని పాత పీహెచ్‌సీ భవనం 1985లో నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు రహదారి ఎత్తు పెరగడంతో పూర్తిగా పీహెచ్‌సీ భవనం లోతట్టుకు కూరుకుపోయింది. దీంతో చిన్నపాటి వర్షం వచ్చిన ఆసుపత్రి నీటితో నిండి పోయి మందులు తడిసిపోయేవి. దీంతో అటు రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో నూతన భవనం నిర్మించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పాత పీహెచ్‌సీ భవనాన్ని కూల్చివేసి అదే స్థలంలో నూతన భవన నిర్మాణ పనులకు ఈ ఏడాది మార్చి 27న అప్పటి మంత్రి జగదీశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి తొమ్మిది నెలలు పూర్తయిన నేటికి భవన నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే ఉన్నాయి.

రూ. 1. 56కోట్లు మంజూరు..

ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ భవన స్థానంలోనే నూతన భవనాన్ని నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ. 1. 56కోట్లు మంజూరు చేసింది. పాత భవనం కూల్చివేసేందుకు అనుమతులు ఆలస్యంగా రావడంతో ఈ ఏడాది మార్చిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. త్వరగా నూతన భవనం అందుబాటులోకి వస్తుందని మెరుగైన వైద్య సేవలు అందుతాయనుకున్న ప్రజలకు భవన నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండడంతో నిరాశే ఎదురవుతుంది. ప్రసుత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల సమాఖ్య భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ భవనంలో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని రోగులు, రోగుల బంధువులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి తెస్తాం



మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి నిధులు మంజూరు కావడంతో పాత పీహెచ్‌సీ భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మాణం చేపట్టాం. ప్రస్తుతం ఫిల్లర్ల దశలో భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. త్వరితగతిన భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

– సుధాకర్‌గౌడ్, ఎంపీపీ

మహాలక్ష్మి పథకం నిబంధనలు సవరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

వలిగొండ : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం నిబంధనలు సవరించాలని కోరుతూ గురువారం ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్ర రాకేష్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద వారికి మాత్రమే ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. అధికంగా వేతనాలు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉచితంగా ప్రయాణం చేయడంతో ఆర్టీసీకి నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు. ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. మహాలక్ష్మి పథకాన్ని సవరిస్తే ఆటో కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ నాయకులు శివ, స్వామి,కిరణ్, రవి,వెంకటేష్, భాను పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

భువనగిరి : పట్టణంలోని పసుపునూరి నాగభూషణం తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం మృతురాలి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, మార్కెట్ కమిటీచైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కోల్పుల అమరేందర్, కిష్టయ్య, బీఆర్ఎస్ పట్టణకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మునుగోడు: ఈ నెల 26వ తేదీన సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. గురువారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు సురిగి చలపతి, గోసుకొండ లింగయ్య, బండమీది యాదయ్య, పాండు, ఈదులకంటి కైలాస్, దుబ్బ వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, దివీస్ ప్రతినిధులు

భువనగిరి : వలిగొండ మండలంలోని గోల్నెపల్లి, నెమిలికాల్వ గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం దివీస్ లెబరేటరీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, సాండిల్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి దివీస్ పరిశ్రమ చేస్తున్న సేవలు అభినందనీయన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయి కి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగాల భిక్షపతిగౌడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణప్రసాద్, డాక్టర్ జయంత్ కుమార్, దివీస్ సీఎస్ఆర్ ఇంచార్జి వెంకటరాజు, సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్‌బాబు, సుల్తాన్ రాజు గురువారం ఆర్డీఓ జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ముందు 174, 175 సర్వే నంబర్లలోని రెండు ఎకరాల భూదాన్ భూమిని ఓ రియల్టర్ ప్లాట్లుగా చేసి 183సర్వే నంబర్ ద్వారా తప్పుడు పత్రాలు సృష్టించి ఇతర వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సర్వేలో ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయినందున ఆ భూమి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ భూములను అమ్మి మోసానికి పాల్పడిన రియల్టర్‌పై పీడీయాక్టు కింద కేసు నమోదు చేయాలని కోరారు.

ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేయాలి


మాట్లాడుతున్న బొలగాని సత్యనారాయణ

బొమ్మలరామారం : కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బొలగాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని మర్యాల గ్రామంలో గురువారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు, పెన్షన్లు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, మహాలక్ష్మి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేష్, భారతమ్మ, రాజప్ప, మైసయ్యగౌడ్, బుజ్జి, ఆనంద్, జయమ్మ, బాలస్వామి, జ్యోతి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి


దళితుల భూములు పరిశీలిస్తున్న నాయకులు

తుర్కపల్లి: దళితుల భూములు ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య అన్నారు. గురువారం మండలంలోని వాసాలమర్రిలో 183 సర్వే నెంబర్‌లో గల దళితుల ఇళ్ల స్థలాలకు సంబంధించి భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల భూములను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తం అక్రమించుకున్నాడని ఆరోపించారు. సీపీఐ తరుపున బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట పలువురు బాధితులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తాం


మాట్లాడుతున్న గిద్దె రాజేష్

మునుగోడు: ఎన్నికల్లో దివ్యాంగుల రిజర్వేషన్ వాటా తేల్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. మునుగోడులో గురువారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ నల్లగొండ ఎమ్మెల్యే టికెట్ బీసీలకు త్యాగం చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారని, కనీసం భువనగిరి ఎంపీ టికెట్ అయినా త్యాగం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి దివ్యాంగులకు దామాషా ప్రకారం పంచాయతీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్‌సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుడిపల్లి సుమతి, జిల్లా నూతన అధ్యక్షుడు తలారి సహదేవులు, ఉపాధ్యక్షుడు వంటిపాక ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తుర్కపల్లి: నిర్మల్ జిల్లాలో ఈ నెల 23న జరిగే రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి తుర్కపల్లి మండలంలోని రాంపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఒగ్గు శివ, అఖిల్, బాషా ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి స్టాలిన్‌బాబు, ప్రిన్సిపాల్ మధుప్రకాశ్, రమేశ్‌రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఆటో డ్రైవర్ల రాస్తారోకో

మునుగోడు: మహాలక్ష్మి పథకంతో ఉపాధి కరువై రోడ్డున పడ్డ ఆటో కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చాపల శ్రీను డిమాండ్ చేశారు. గురువారం మునుగోడులో ఆటో యూనియన్ నాయకులతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం రాక ముందు ప్రతి ఆటో డ్రైవర్ రోజుకు రూ.600 నుంచి రూ.800 ఆదాయం పొందేవారన్నారు. కానీ మహాలక్ష్మి పథకంలో మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం చేయడంతో రోజుకు కనీసం రూ.100 కూడా ఆదాయం రావడంలేదన్నారు. దీంతో ఆటోల కొనుగోలుకు ఫైనాన్స్‌లలో తెచ్చిన అప్పులు తీర్చలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఎండీ. జా నిమీయా, శంకర్, భిక్షం, నర్సింహ, నరేందర్ నా గ రాజు, వెంకన్న, రాంబాబు, వెంకన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పంబా ఆరట్టు


భువనగిరి : చెరువులో స్వామివారి విగ్రహానికి అభిషేకాలు నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరి : పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో పంబా ఆరట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, నవాభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తికి స్థానిక హన్మాన్‌వాడలోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా నుంచి ఆజాద్ రోడ్డు, హైదరాబాద్ చౌరస్తా మీదుగా పెద్ద చెరువుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కోలాటాలు, డప్పుల వాయిద్యాలు, అయ్యప్ప స్వామి పాటల మధ్య స్వామి వారి ఊరేగింపు వైభవంగా సాగింది. స్థానిక పెద్ద చెరువు వద్ద స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరోత్తమరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బెలిదే వెంకటేష్, అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు,సెక్రటరీ సత్యం, కోశాధికారి శ్యాంఘటాని, మాజీ అధ్యక్షుడు రాములు, ఉప్పల రమేష్,రవీందర్,వినోద్,నరేష్, సుధాకర్, తంగళ్లపల్లి రవికుమార్, మాయ దశరథ, చందా మహేందర్ గుప్తా,రత్నపురం బలరాం పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయం ఎంతో గొప్పది


చౌటుప్పల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

చౌటుప్పల్ : హిందూ సంప్రదాయం ఎంతో గొప్పదని ఎన్ఆర్ఐ కర్ల శ్రీనివాస్‌రావు అన్నారు. ఇంగ్లాండ్ దేశంలో స్థిరపడిన ఆయన ఇటీవల స్వస్థలానికి వచ్చి అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. గురువారం స్థానిక సత్యదేవ సహిత అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి భాస్కర్, బొబ్బిళ్ల మురళి, సాయిలు, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్, శంకర్, చంద్రం, రమేష్, రాము, నాగరాజు, రాజేష్, సంపత్, శివకృష పాల్గొన్నారు. శ్రీబాలాజీ రామకృష్ణ దేవాలయంలో డాక్టర్ శ్వేతప్రియాంక-సుధీర్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

భువనగిరిటౌన్ : పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మహిళా రాష్ట్ర కన్వీనర్ యాదమ్మ, నాయకులు అనిత, అంజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేవూరి ధర్మేందర్‌రెడ్డికి డాక్టరేట్

మోత్కూరు : మోత్కూరు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ నేవూరి ధర్మేందర్‌రెడ్డికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అడ్మినిస్ట్రేషన్‌లో పరిశోధన చేసినందుకు తనకు డాక్టరేట్ అందజేశారని ధర్మేందర్‌రెడ్డి తెలిపారు.

కేంద్ర పథకాలపై అవగాహన


కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలేరురూరల్ : మండలంలోని కొల్లూరు గ్రామంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, ఎంపీఓ సలీం పలువురు ప్రజాప్రతినిధులు తదతరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు

రామన్నపేట : మండలకేంద్రంలో శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు కొనసాగుతున్నాయి. పూజల్లో భాగంగా గురువారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సిరిపురంలో భక్తులు నగర సంకీర్తన చేశారు.

మిస్సింగ్ కథ సుఖాంతం

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని బండసోమారం గ్రామంలో ఆన్‌లైన్ గేమ్ ఆడి ఇంటి నుంచి పారిపోయిన చెరుకూరి ప్రసాద్ గురువారం హైదరాబాద్‌లో దొరికినట్లు బంధువులు తెలిపారు. కాగా ప్రసాద్ ఈ నెల 18న తన చావుకు తన తండ్రే కారణమని సెల్ఫీ వీడియో తీసి వివిధ వాట్సాప్ గ్రూపులలో పెట్టి అదృశ్యమయ్యాడు. కాగా అతడు గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ సమీపంలోని కోర్టు వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి అతడిని ఇంటికి తీసుకొని వచ్చారు.


ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి గాదరి కిశోర్‌కు లేదు


సమావేశంలో మాట్లాడుతున్న వంగాల సత్యనారాయణ

మోత్కూరు : తెలంగాణ ఉద్యమకారుడు, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చేడె చంద్రయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు అవిశెట్టి అవిలుమల్లు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను బినామీల పేరు చేయించుకుని కోట్లు సంపాదించిన చరిత్ర గాదరి కిశోర్‌కుమార్‌ది అన్నారు. ఎమ్మెల్యే సామేల్‌పై అడ్డగోలుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు మందుల సురేష్, కారుపోతుల వెంకన్న, ఎస్‌యూఐ జిల్లా నాయకుడు నిమ్మల శ్రీనివాస్, నాయకులు పురుగుల నర్సింహ, ఎండీ .సమీర్, అవిశెట్టి కిరణ్, చిప్పలపల్లి యాదగిరి, బుషిపాక రమేష్, తొంట మహేష్, జక్కుల రాముయాదవ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం


ఆలయ ముఖద్వారం


దేవాలయం పక్కన ఉన్న చెరువు

- నేటి నుంచి ప్రారంభంకానున్న ఆది మహావిష్ణువు ఆలయ ఉత్సవాలు
- 23న స్వామివారి కల్యాణ మహోత్సవం
- వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో హాజరుకానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు

చౌటుప్పల్ : మండలంలోని దేవలమ్మనాగారం గ్రామంలోని శ్రీ ఆది మహావిష్ణువు దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఆలయ వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా విరాజిల్లుతున్న స్వయంభూ దశావతార శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ ఆదిమహావిష్ణువు బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతి రమణీయతకు..

చుట్టూ ఎక్కడ చూసినా పచ్చని చెట్లు.. సమీపంలోనే నీటితో కళకళలాడే చెరువు, పక్షుల కిలకిల రావాలు మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ ఆలయం ప్రకృతి రమణీయతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఆలయానికి ప్రధాన దారి చెరువు కట్టపై నుంచి ఉండడం, ఆలయానికి చెందిన సువిశాలమైన స్థలంలో ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు, పూల మొక్కలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

బ్రహ్మోత్సవాలు ఇలా..

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. 22న గణపతి పూజ, స్వస్తివచనం, ధ్వజారోహణం, మహా సుదర్శన యాగం, అంకురార్పణం నిర్వహిస్తారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఉదయం 6గంటల నుంచి 11-30 గంటల వరకు వైకుంఠద్వార దర్శనం, అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీఆదిమహావిష్ణువు కల్యాణ మహోత్సవం జరిపిస్తారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. 24న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, బిల్వార్చన కార్యక్రమాలతో వేడుకలు ముగుస్తాయి.

వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తాం



ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ఎవరికీ ఎలాంటి లోటు రాకుండా వేడుకలు జరిపిస్తాం. వేడుకలకు గ్రామస్తులతో పాటు దాతలు సహకరిస్తున్నారు.

–వరకాంతం జంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్